MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 316 | శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-

# తీరం వెంబడి గంటకు 50 కిమీ వేగంతో ఈదురు గాలులు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**(అంకుశం ప్రతినిధి, అమరావతి, సెప్టెంబర్ 26):**

ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం కారణంగా తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిమీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. శు క్రవారం వాయువ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం. శనివారం ఉదయానికి దక్షిణ ఒడిశా%-%ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం. దీని ప్రభావంతో నేడు రాష్ట్రంలో ఒకటి,రెండు చోట్ల అతిభారీ వర్షాలు. శుక్రవారరా ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు పడ్డాయి. బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిశాయి. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం ఉందని దీంతో ప్రజలు చెట్ల క్రింద, శిథిలావస్థలోని భవనాలు వద్ద ఉండరాదు. సోమవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని ఆయన తెలిపారు.

# లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడమే లక్ష్యం



- వస్తు రవాణా, ప్రయాణికుల రవాణా లాంటి మాధ్యమాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది
- పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారి మార్గాలు, రైల్వే ఇలా వేర్వేరు రంగాలను విస్తృతం చేయాలి
- రవాణా రంగంలో రోడ్ల ద్వారా జరిగే రవాణా 41 శాతం మేర వాటా కలిగి ఉంది
- లాజిస్టిక్స్‌కు అయ్యే వ్యయాన్ని తగ్గించగలిగితే ఉత్పత్తి వ్యయమూ తగ్గుతుంది
- పైప్ లైన్ మార్గం కీలకం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

లాజిస్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల అంశం పై ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. వస్తు రవాణా, ప్రయాణికుల రవాణా లాంటి మాధ్యమాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారి మార్గాలు, రైల్వే ఇలా వేర్వేరు రంగాలను విస్తృతం చేయాలని సూచించారు. భారత్‌లో లాజిస్టిక్స్ వ్యయం రూ.24.01 లక్షల కోట్లుగా ఉందని చెప్పుకొచ్చారు. జీడీపీలో లాజిస్టిక్స్ వాటా 7.97 శాతంగా ఉందని వివరించారు. రవాణా రంగంలో రోడ్ల ద్వారా జరిగే రవాణా 41 శాతం మేర వాటా కలిగి ఉందని తెలిపారు. లాజిస్టిక్స్‌కు అయ్యే వ్యయాన్ని తగ్గించగలిగితే ఉత్పత్తి వ్యయమూ తగ్గుతుందని వెల్ల డించారు సీఎం చంద్రబాబు. ఇది ఉత్పత్తిదారులు, వినియోగదా రులతోపాటు అందరికీ ప్రయోజనం - మిగతా3లో

# డయేరియా వ్యాప్తి నివారణకు చర్యలు



**అమరావతి**

రాష్ట్ర వ్యాప్తంగా జిఇ, డయేరియా వంటి సీజనల్ గా వచ్చే వ్యాధులు వ్యాప్తి కాకుండా జిల్లా కలెక్టర్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన సీజనల్ కండిషన్స్ అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఎక్కడైనా డయేరియా, జిఇ వంటి కేసులు వస్తే వెంటనే - మిగతా3లో

# దుర్గమ్మ సన్నిధిలో గవర్నర్ అబ్దుల్ నజీర్

**(అంకుశం ప్రతినిధి, విజయవాడ, సెప్టెంబర్ 26)**

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్‌కు దేవాదాయ శాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్ర మోహన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, దుర్గగుడి ఈవో వీకే శీనా నాయక్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



## పవన్ కళ్యాణ్‌కు తగ్గని జ్వరం

### చికిత్స కోసం హైదరాబాద్‌కు పయనం



**(అంకుశం ప్రతినిధి, అమరావతి, సెప్టెంబర్ 26):**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైరల్ జ్వరంతో బాధపడుతున్నారు. నాలుగు రోజులుగా వైద్యం చేయించుకొంటున్నా జ్వరం తీవ్రత తగ్గలేదు. దగ్గు ఎక్కు వగా ఉండటంతో ఇబ్బందిపడుతున్నారు. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్ లో వైద్య పరీక్షలు చేయించుకోనున్నారు. శుక్రవారం పవన్ కల్యాణ్ మంగళగిరి నుంచి హైదరాబాద్ వెళ్లారు.

# తీవ్ర అల్పపీడనం.. భారీ వర్షాలు



## అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

## అధికారులతో సమీక్షించిన హోం మంత్రి అనిత

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ అల్పపీడనం వచ్చే 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, ఎటువంటి అత్యవసర పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తిగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు కురుస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా కోస్తాంధ్ర, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. సహాయక చర్యల కోసం పోలీస్, ఫైర్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని హోం మంత్రి ఆదేశించారు. మత్స్యకారులు - మిగతా3లో

# ఎస్కేయూ అక్రమాలపై విచారణకు కమిటీ



- విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్
- కంప్యూటర్ల కొనుగోలులో దుర్వినియోగం, యూనివర్సిటీ వాహనాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, నియామకాలు, రిక్రూట్‌మెంట్‌లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంపై కమిటీ
- వంద రోజుల్లో నివేదిక తెప్పించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- పారదర్శకంగా విశ్వవిద్యాలయాలు నడిపించాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం ఉంది

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

అనంతపురం శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో 2019-24 నడుమ జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభలో తెలిపారు. కంప్యూటర్ల కొనుగోలులో దుర్వినియోగం, యూనివర్సిటీ వాహనాలను వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు, నియామకాలు, రిక్రూట్‌మెంట్‌లో రూల్స్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంపై కమిటీ వేస్తామన్నారు. వంద రోజుల్లో నివేదిక తెప్పించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. - మిగతా3లో

# ‘విశ్వాసం లేని వ్యక్తి బాలకృష్ణ.. ఆయనే పెద్ద సైకో’

**తాడేపల్లి:** అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలపై ఇటు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. మెగా అభిమానులు కూడా బాలయ్యను టార్గెట్ చేసి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. విశాఖలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మాట్లాడుతూ..‘సంస్కారం లేని వ్యక్తి బాలకృష్ణ. మందు తాగి అసెంబ్లీ వేదికగా మాట్లాడారు. చిరంజీవి తనతో సమానమని బాలకృష్ణ అనుకుంటారు. చిరంజీవి కాలిగోటికి బాలకృష్ణ పనికిరారు. స్వశక్తితో చిరంజీవి హీరోగా ఇండస్ట్రీలో స్థానం సంపాదించుకున్నారు. ఎన్టీఆర్ మీద చంద్రబాబు చెప్పులు వేయించిన రోజే బాలకృష్ణ చచ్చిపోయారు. బాలకృష్ణను కాల్పుల ఘటనలో కాపాడింది వైఎస్సార్. బాలకృష్ణ సినిమాలకు రేట్లు పెంచమని ఆదేశాలు ఇచ్చింది వైఎస్ జగన్. విశ్వాసం లేని వ్యక్తి బాలకృష్ణ. మెంటల్ సర్టిఫికెట్ ఉన్న వాళ్లకి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వకూడదు. చిరంజీవి ప్రకటన ద్వారా బాలకృష్ణ చెప్పిందంతా అబద్ధమని తేలిపోయింది. చిరంజీవి దంపతులను వైఎస్ జగన్ దంపతులు ఎంతో గౌరవించారు. చిరంజీవిపై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై జనసేన ఎలా స్పందిస్తుందో చూడాలి అని కామెంట్స్ చేశారు.

**చిరంజీవి కాలి గోటికి సరిపోవు బాలకృష్ణపై గుడివాడ ఫైర్**

వైఎస్సార్ జిల్లా...

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ..‘అసెంబ్లీలో బాలకృష్ణ జులాయిగా వ్యవహరించాడు. బాలకృష్ణ ఇంట్లో గన్ ఫైర్ ఘటనలో నిన్ను కాపాడింది వైఎస్సార్ మరిచిపోయావా?. వైఎస్ జగన్ సినీ



పరిశ్రమ పట్ల స్పందించిన తీరును స్వయాన చిరంజీవి లేఖ రూపంలో తెలిపారు. నాడు వైఎస్ జగన్ చిరంజీవిని ఎంత ఆప్యాయంగా వ్యవహరించారో అందరికీ తెలుసు. సినీ ఇండస్ట్రీని ఇంటికి పిలిచి వైఎస్ జగన్ సమస్యలను పరిష్కరించారు. అసెంబ్లీ సాక్షిగా వైఎస్ జగన్‌ని అప్రతిష్ట పాలు చేసేలా కూటమి నాయకులు విమర్శించే పనిగా పెట్టుకున్నారు. బసవతారక క్యాన్సర్ ఆసుపత్రికి కోట్ల రూపాయలు సీఎం సహాయ నిధికి డబ్బులు మంజూరు చేసింది జగన్ అని తెలిపారు.

**కాకినాడ..**

వైఎస్సార్‌సీపీ నాయకురాలు వంగా గీతా మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌పై బాలకృష్ణ, కామినేని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. మాజీ సీఎం పట్ల అసెంబ్లీలో బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం సభను అగౌరపరచడమే. అసెంబ్లీ అనేది ఎంతో పవిత్రమైన స్థలం. కేవలం 175 మందికి మాత్రమే ఆ పవిత్రమైన స్థలంలోకి వెళ్ళే అవకాశం వస్తుంది. చంద్రబాబు హయంలో టీడీపీ అధికారంలోకి వచ్చాకా.. ఎన్టీఆర్ పేరును ఒక జిల్లాకైనా పెట్టారా?. వైఎస్ జగన్ మాత్రమే ఎన్టీఆర్ పేరును ఒక జిల్లాకు పెట్టారు. వైఎస్ జగన్‌కు ప్రజలంటే అభిమానం. చిరంజీవి చాలా సౌమ్యమైన వ్యక్తి. ఎప్పుడు ఒక్క అడుగు తగ్గే ఉంటారు. వైఎస్ జగన్, చిరంజీవి ఎదుట వారిని గౌరవించే వ్యక్తులు. ఎవర్ని తక్కువ చేయాలనుకునే వ్యక్తులు కాదు. అలాంటి ఆ ఇద్దరు వ్యక్తులను చాలా తేలికగా మాట్లాడుతున్నారు. ఇది చాలా తప్పు. ఇక ముందు వైఎస్ జగన్, చిరంజీవిని తక్కువగా చేసి మాట్లాడవద్దు అని హితవు పలికారు.

**విశాఖ..**

మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ..‘బాలకృష్ణ పెద్ద సైకో. బాలకృష్ణను మించిన సైకో మరొకరు లేరు. వైఎస్ జగన్‌కు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి. అసెంబ్లీలో బాలకృష్ణ తాగి మాట్లాడారు. చిరంజీవిని చూసి బాలకృష్ణ ఓర్వలేకపోతున్నారు. చిరంజీవి ఆధ్వర్యంలో సినీ బృందాన్ని వైఎస్ జగన్ ఎంతో ఆప్యాయంగా గౌరవించారు. తాగుబోతు బాలయ్యకు నోరే సరిగా తిరగదు. బాలకృష్ణ నటనకు ఏనాడు అవార్డుల రాలేదు. రికమండేషన్లతో అవార్డులు సాధించిన వ్యక్తి బాలకృష్ణ అని చెప్పారు.

**వైఎస్సార్ జిల్లా..**

నందమూరి బాలకృష్ణపై మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజాద్ బాషా మాట్లాడుతూ.. ‘అసెంబ్లీని బాలకృష్ణ అపహాస్యం చేశారు. మందు తాగి వచ్చిన వ్యక్తిలా నందమూరి బాలకృష్ణ ప్రవర్తించాడు. ఆయన వ్యాఖ్యలను వైఎస్సార్ పార్టీ పూర్తి ఖండిస్తుంది. బాలకృష్ణ వ్యాఖ్యలను చిరంజీవి సైతం ఖండించారు. బాలకృష్ణ వ్యాఖ్యలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కనీసం ఖండించలేదు’ అని ఘాటు విమర్శలు చేశారు.

# కొత్తగా కారవాన్ పార్క్

**విశాఖపట్టణం :** రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఏజెన్సీ ప్రాంతాలలో కారవాన్ పార్కుల ఏర్పాటుకు ఆలోచనలు చేస్తోంది. ఈ క్రమంలోనే అల్లూరి జిల్లా లంబసింగి వద్ద కారవాన్ పార్క్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇప్పటికే తాజంగి సమీపంలో భూమిని గుర్తించగా.. పర్యాటక శాఖ సీనియర్ అధికారులు ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించి కారవాన్ పార్కు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కారవాన్ పార్కుల ద్వారా పర్యాటకులను ఆకర్షించడమే కాకుండా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలనేది ప్రభుత్వం ఉద్దేశం.ఏపీలో పర్యాటక రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం కొత్త ఆలోచనలు చేస్తోంది. అందులో భాగంగా కారవాన్ పార్కుల ఏర్పాటు తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో కారవాన్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇక ఆంధ్రా కశ్మీర్‌గా పేరొందిన లంబసింగి కి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ముఖ్యంగా ఈ వానకాలంలో లంబసింగి అందాలు కొత్త రూపు సంతరించుకుంది. ఈ అందాలను చూడటానికి, ఆస్వాదించడానికి ప్రకృతి ప్రేమికులు ఎక్కడెక్కడి నుంచో వస్తుంటారు. ఈ నేపథ్యంలో లంబసింగిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా లంబసింగిలో పర్యాటకులను ఆకర్షించేందుకు కారవాన్ పార్కు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచించింది.


ఈ నేపథ్యంలో కలెక్టర్ దినేష్ కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. లంబసింగిలో కారవాన్ పార్క్ ఏర్పాటు కోసం తాజంగి సమీపంలోని ఒక ఎకరా ప్రభుత్వ భూమిని అధికారులు కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్రతిపాదిత స్థలాన్ని ఏపీ పర్యాటక శాఖ సీనియర్ ప్రాజెక్టు అధికారులు ఇటీవల పరిశీలించారు. కారవాన్ పార్కు ఏర్పాటుకు ఉన్న



సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో కారవాన్ పార్కులు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. ఏజెన్సీలో కారవాన్ పార్కుల ఏర్పాటు కోసం మొత్తం ఐదు ప్రాంతాలను గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. పాడేరు డివిజన్‌లో మూడు చోట్ల, రంపచోడవరంలో రెండుచోట్ల కారవాన్ పార్కుల ఏర్పాటు కోసం స్థలాలు గుర్తించామని తెలిపారు. అలాగే అల్లూరి జిల్లాలో మొత్తం 147 హోంస్టేలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు.మరోవైపు వివిధ రాష్ట్రాలలో అమలవుతున్న కారవాన్ టూరిజం పాలసీలను అధ్యయనం చేసిన తర్వాత ఏపీ ప్రభుత్వం కారవాన్ టూరిజం పాలసీ తేసుంది. కారవాన్ టూరిజం పాలసీలో భాగంగా కారవాన్ పార్కులు ఏర్పాటు చేయనున్నారు. అరకు , భీమిలి వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. గతంలో ఎన్నడూ చూడని ప్రాంతాలకు కూడా సందర్శకులను తీసుకువెళ్లేలా ఈ కారవాన్ పార్కులు ఉపయోగపడతాయని అధికారులు చెప్తున్నారు. కావాలనుకున్నప్పుడు విశ్రాంతి తీసుకునేలా ఈ వాహనాలు ఏర్పాటు చేస్తారు. ఇందులో వసతి సౌకర్యాలు, పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయనున్నారు. వాకింగ్ ట్రాక్‌లు, సిట్–అవుట్, బ్యాడ్మింటన్ కోర్టులు వంటి ప్రదేశాలు, తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉంచుతారు. అడవులలోని సుందరమైన ప్రదేశాలు, ప్రాంతాలకు సమీపంలో ఈ కారవాన్ పార్కులను అభివృద్ధి చేస్తారు.

# ఏపీకి క్యూ కడుతున్న ఐటీ సంస్థలు

**విశాఖపట్టణం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో అంతర్జాతీయ సంస్థ రానుందా అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే పలు ఐటీ సంస్థలు ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. విశాఖ వేదికగా గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్ క్యాంపస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. తాజాగా మరో అంతర్జాతీయ ఐటీ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిసింది. యాక్సెంచర్ సంస్థ ఏపీలో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు ప్రముఖ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. ఈ క్యాంపస్ ఏర్పాటు ద్వారా 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని వెల్లడించింది. విశాఖపట్నం వేదికగా యాక్సెంచర్ కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు రాయిటర్స్ సంస్థ పేర్కొంది. ఈ ప్రతిపాదనలు ప్రస్తుతం చర్చల దశలోనే ఉన్నాయని.. అనుమతులు లభించడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపింది.మరోవైపు టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు కూడా విశాఖలో పెట్టుబడులు పెడుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం వాటికి 99 పైసలకే ఎకరం చొప్పున భూములు కేటాయించింది. ఈ నేపథ్యంలోనే యాక్సెంచర్ సంస్థ కూడా విశాఖలో కొత్త క్యాంపస్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. క్యాంపస్ ఏర్పాటు కోసం విశాఖలో పది ఎకరాలు భూమి కావాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిసింది. యాక్సెంచర్ ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై యాక్సెంచర్ సంస్థ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.మరోవైపు విశాఖకు




టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థల రాకతో 20 వేల ఉద్యోగాలు లభిస్తాయని అధికారులు చెప్తున్నారు. కాగ్నిజెంట్ 183 మిలియన్ డాలర్లు, టీసీఎస్ 154 మిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతున్నాయి. అటు తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ తర్లువాడలో ఏర్పాటు చేయనుంది. ఆ రకంగా విశాఖపట్నానికి ఐటీ సంస్థలు తరలి వస్తున్నాయని అధికారులు చెప్తున్నారు. ఇక గూగుల్ డేటా సెంటర్ కోసం సింగపూర్ నుంచి సముద్రంలో కేబుల్స్ తీసుకురావాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. మొత్తానికి ఏపీ ఆర్థిక రాజధానిగా విశాఖను తీర్చదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యం దిశగా అడుగులు పడుతున్నాయి.

## ఉచితంగా సివిల్ సర్వీసెస్ కోచింగ్ ప్రారంభిస్తాం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

వంద మంది బీసీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

ఏటా డీఎస్సీ నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయం

డీఎస్సీకి కూడా ఉచిత కోచింగ్ అందజేస్తాం :

మంత్రి సవితను సత్కరించిన స్టడీ సర్కిల్ ఉద్యోగులు



**అంకుశం ప్రతినిధిఅమరావతి : సెప్టెంబర్ 26** బీసీ స్టడీ సర్కిల్ ద్వారా త్వరలో సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్ లో మంత్రి సవితను ఏపీ బీసీ స్టడీ సర్కిల్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. బీసీ సంక్షేమ శాఖకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు వచ్చినందుకు గానూ మంత్రిని వారు సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో వివిధ పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా త్వరలో సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత తొలి విడతగా 83 మందికి సివిల్ సర్వీసెస్ కోచింగ్ అందజేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు మరో బ్యాచ్ కు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ బ్యాచ్ లో వంద మంది వరకూ ఉంటారని తెలిపారు. అమరావతిలో అయిదు ఎకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ప్రభుత్వం ఏటా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించిందని, బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా బీసీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ కూడా అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో 270 మంది బీసీ అభ్యర్థులు టీచర్లగా ఎంపిక కావడానికి కృషి బీసీ స్టడీ సర్కిల్ సిబ్బందిని మంత్రి సవిత అభినందించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి సవితకు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వెంకటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## లాజిస్టిక్స్ వ్యయం తగ్గించడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

చేకూరుస్తుందని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ఎకో సిస్టమ్ లో రైలు, రోడ్డు, జల రవాణాతోపాటు పైప్‌లైన్ మార్గం కూడా కీలకంగా మారిందని చెప్పుకొచ్చారు. పైప్‌లైన్ ద్వారా గ్యాస్, నీరు, స్లర్రీ లాంటివి రవాణా చేసేందుకు ఆస్కారం ఉందని వెల్లడించారు. మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ ద్వారా హైయ్యర్ కార్గో రవాణా చేస్తే వ్యయం తక్కువ అవుతుందని వివరించారు. ఏపీకి ప్రస్తుతం డ్రై పోర్టుల ప్రాజెక్టులు పెద్దఎత్తున వస్తున్నాయని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ ఎకో సిస్టమ్ లో మౌలిక సదుపాయాలే ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఉద్ఘాటించారు. దీని కోసం ఓ బ్లూ ప్రింట్ తయారు చేసి వ్యయం తగ్గించటమే లక్ష్యంగా పనిచేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఆ జిల్లాల్లో బ్లాక్ సాయిల్..**

‘భారతదేశ లాజిస్టిక్స్ కాస్ట్ రూ.24 లక్షల కోట్లు. పాత్ హెూల్స్ ఫ్రీ రోడ్లు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేశాం. ఇంకా చాలా చేయాల్సి ఉంది. డబ్బులు ఎంతైనా ఫర్వాలేదు.. అయితే పాత్ హెూల్ ఉంటే వదిలిపెట్టనని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని ఆదేశించాను. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో బ్లాక్ సాయిల్ అవ్వడంతో వెంటనే రోడ్లు దెబ్బతింటున్నాయి. రాయలసీమలో ఆ ఇబ్బంది ఉండదు. మొదట్లో గుంతల మూలంగా కోల్‌కత్తా నుంచి చెన్నైకి వెళ్లాలంటే నాలుగైదు రోజులు పట్టేది. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయితో మాట్లాడి స్వర్ణ చతుర్భుజికి శ్రీకారం చుట్టాం. రోడ్లు నాగరికతకు చిహ్నం. 4,739 కిలోమీటర్లు జాతీయ రహదారులు ఏపీలో ఉన్నాయి. వెయ్యి స్కేర్ కిలోమీటర్లకు 53 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉన్నాయి. ఇప్పుడున్నవి కాకుండా రెండు లైన్లు, నాలుగు రైల్వే లైన్లు చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. అలాగే హైస్పీడ్ రైల్వే కారిడార్‌కూ కేంద్రం అంగీకరించింది’ అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు.

**విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు..**

‘హైదరాబాద్– బెంగళూరు కారిడార్, హైదరాబాద్– చెన్నై కారిడార్ నాలుగు లైన్ల రైల్వే లైన్లు రాబోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖపట్నంలో రైల్వేజోన్‌ను ఏర్పాటు చేశాం. ఆంధ్రప్రదేశ్ నుంచి హైస్పీడ్ రైళ్లు కూడా వెళ్లనున్నాయి. 1053 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఏపీకి ఉంది. గుజరాత్ తర్వాత 320 మిలియన్ టన్నుల కెపాసిటీతో మనం హ్యాండిల్ చేయొచ్చు. అయితే 12 మిలియన్ టన్నులను మాత్రమే.. ఇప్పుడు హ్యాండిల్ చేయగలిగే రెండో స్థానంలో ఏపీ ఉంది. రామాయపట్నం ఏప్రిల్ 26వ తేదీకి, మచిలీపట్నం డిసెంబర్ 26వ తేదీకి పూర్తిచేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం. ఫిషింగ్ హర్బర్‌లు అన్ని పూర్తయితే మత్స్యకారులకు ఉపాధి లభిస్తోంది. అమరావతి నుంచి కృష్ణా నదిలో ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ కనెక్ట్ చేశాం. ఏపీలో ఆరు ఎయిర్‌పోర్టుల ఆపరేషన్ జరుగుతున్నాయి.. ఇంకొక్కటి విశాఖపట్నం ఎయిర్ పోర్టు నడుస్తోంది. విశాఖపట్నంలో రానున్న ఆగస్టు కల్లా మరో ఎయిర్ పోర్టు ఆపరేషన్‌కు వస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్యాసింజర్ ట్రాఫిక్ పెరిగింది’ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## డయేరియా వ్యాప్తి నివారణకు చర్యలు

-మొదటిపేజీ తరువాయి

ఆప్రాంతాలను పూర్తిగా కంటైన్మెంట్ చేసి వివిధ ఫుడ్ స్టాల్స్ ను పూర్తిగా నిలిపివేయడంతో పాటు మంచినీటి పైపు లైన్ల లీకేజీలను పూర్తిగా నియంత్రాంచాలని చెప్పారు. ఇటీవల విజయవాడ, గుంటూరు నగరాల్లో డయేరియా వ్యాప్తి చెంది స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అలాంటి సమయాల్లో అధికార యంత్రాంగం తక్షణం స్పందించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతోపాటు ఫుడ్ స్టాల్స్ ను పూర్తిగా మూసివేయించా లని ఆదేశించారు.మంచినీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా ఎప్పటి కప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అదే విధంగా అన్ని చేతి పంపులను,బోర్ వెల్స్ ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడంతో పాటు నీటి నాణ్యత పరీక్షలు కూడా చేయించాలని చెప్పారు. ఏగ్రామం లేదా వార్డులో ఎక్కడైనా డయేరియా లేదా జిఇ కేసులు వస్తే వెంటనే తక్షణ చర్యలు తీసుకుని ఆయా ప్రాంతాలను పూర్తిగా కంటైన్మెంట్ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు. డ్రైన్ల వెంబడి ఉండే మంచినీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని సిఎస్ విజయా నంద్ అధికారులను ఆదేశించారు. ఈవిషయంలో మున్సిపల్, పంచాయితీ రాజ్ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఎక్కడైనా అధికారుల పర్యవేక్షణ లోపం లేదా నిర్లక్ష్యం కారణంగా డయేరియా లేదా జిఇ కేసులు ప్రబలితే ఎంతమాత్రం సహించేదని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఎస్ విజయానంద్ స్పష్టం చేశారు. గోదావరి,కృష్ణా నదులకు వరద ప్రవాహం పెరుగుతున్నందున ఆయా నదుల పరివాహక ప్రాంతాల జిల్లా కలక్టర్లు పూర్తి అప్రమత్తంగా ఉండి ఎప్పటి కప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని సిఎస్ విజయా నంద్ ఆదేశించారు. రానున్న మూడు రోజులు వర్షాలు, భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలక్టర్లను ఆదేశించారు.

# గొల్లపూడి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాట్లు సమీక్షించిన ఎంపీ కేశినేని శివనాథ్..

**– ఓజి సినిమా విజయోత్సవ సభ, కాంతారా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహణకు సన్నాహం..**






**అంకుశం ప్రతినిధి విజయవాడ సెప్టెంబర్ 26:** విజయవాడ ఉత్సవ్ లో భాగంగా జరుగుతున్న ఎగ్జిబిషన్‌కు అద్భుతమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. గొల్లపూడి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి అంశంలోనూ సక్రమమైన సదుపాయాలు కల్పించాలని అధికారులు, నిర్వాహకులను ఆదేశించారు.
వర్షం అనుకూలిస్తే ఈనెల 27న హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌ను సందర్శించే ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ సూచించారు. పార్కింగ్ సదుపాయాలను విస్తృతంగా కల్పించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.

వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మైదానంలో డ్రైనేజ్ వ్యవస్థ, షెల్టర్ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఎంపీ ఆదేశించారు. అలాగే ఎగ్జిబిషన్‌లో ప్రజల వినోదం కోసం ప్రదర్శన స్టాళ్లు, ఫుడ్ స్టాళ్లు, ప్రత్యేక ఆకర్షణలు సిద్ధం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతా అనుకున్నట్లు జరిగితే గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుంచి ఓజి సినిమా విజయోత్సవ సభ నిర్వహించాలని భావిస్తున్నామని, ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు. అక్టోబర్ 2న రిలీజ్ కానున్న కాంతారా సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈనెల 30న ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించాలని భావిస్తున్నట్లు ఎంపీ వివరించారు. రానున్న రోజుల్లో విజయవాడ ఉత్సవ్ నగర వాసులకు మరింత కనువిందు చేయనుందని ఎంపీ స్పష్టం చేశారు.

విజయవాడ దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది ఉత్సవాలకు భక్తుల తాకిడి బాగా పెరిగిందని ఎంపీ తెలిపారు. సహజంగా మూల నక్షత్రం రోజున భక్తులు పోటెత్తుతారని, అలాంటిది గురువారం ఒక రోజే లక్షన్నర మంది అమ్మవారిని దర్శించుకున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో భక్తులు మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించినట్లు ఎంపీ వెల్లడించారు.

# మండల అభివృద్ధికి పరస్పరం సహకారం

**రాప్తాడు, అంకుశం న్యూస్ సెప్టెంబర్ 26:** మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకునేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేద్దామని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి అన్నారు. రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ బి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.
గొందిరెడ్డిపల్లి, గాండ్లపర్తి, గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్ల సమస్యను విద్యుత్ ఏఈఈ శివప్రసాద్ ను సర్పంచులు మిడతల శీనయ్య, నరేష్, ఎంపీటీసీ జాఫర్ కోరారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు




అధికారులు సంయమనంతో పరస్పరం సహకారంతో సమస్యను పరిష్కరించాలన్నారు. వెలుగు ఏపీఎం సునీత మాట్లాడుతూ ఎండీఎం మైక్రో ఎంటర్ప్రెన్యూర్షిప్ కింద ఔత్సాహిక మహిళా సంఘాల సభ్యులను గుర్తించి వారిని పారిశ్రామిక వేత్తలుగా తయారు చేసేందుకు పైలెట్ మండలంగా రాప్తాడు ఎంపికైందన్నారు. రైతుల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ లో భాగంగా ఎం.బండమీదపల్లి గ్రామం ఎంపికైందన్నారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి దివ్య తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద వివిధ పనులు చేపడుతున్నామని ఏపీఓ సావిత్రి అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 మన్నల వరలక్ష్మి, ఏఓ భానురేఖ, డిప్యూటీ ఎంపీడీఓ సాకే ప్రేమ్ కుమార్, అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం సరఫరా చేయాలి

**– పాఠశాలల్లో ఇబ్బందులపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పరిటాల సునీత**
**– గతంలో నాడు-నేడు పనులు అసంపూర్తిగా వదిలేసి వెళ్లిపోయారన్న సునీత**
**– పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే చేపట్టాలని కోరిన సునీత**

**అంకుశం న్యూస్ అనంతపురం సెప్టెంబర్ 26:** ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల్ని పరిష్కరించాలని అసెంబ్లీ వేదికగా.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జరిగిన అసెంబ్లి సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్.. ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తామని చెప్పారన్నారు. చెప్పిన ప్రకారం ఇది అమలు చేస్తున్నందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో బియ్యం సరిగా లేక పిల్లలు మధ్యాహ్న భోజనం తినేందుకు ఇష్టపడే వారు కాదని.. చాలా మంది ఇళ్ల వద్ద నుంచే తెచ్చుకునే వారన్నారు. ఇప్పుడు సన్నబియ్యం సరఫరా చేయడం వలన భోజనం చాలా రుచిగా ఉంటోందని.. అందుకే పిల్లలు కూడా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. పిల్లలు గతం కంటే ఎక్కువ మంది భోజనం చేస్తున్నందున పాఠశాలలకు అందించే బియ్యం సరిపోవడం లేదన్నారు. ఇటీవల పాఠశాలల్ని సందర్శించినప్పుడు ఉపాధ్యాయులు తమ దృష్టికి ఈ సమస్య తీసుకొచ్చారన్నారు. కావున పాఠశాలల్లో అవసరం మేరకు సన్నబియ్యం సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో పాఠశాలల్లో నాడు - నేడు పేరుతో చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలించి వెళ్లిపోయారన్నారు. అందుకే ఎక్కడ చూసినా సమస్యలు కనిపిస్తున్నాయన్నారు. మొండిగోడలు, తలుపులు లేని



పాఠశాలలు, పిల్లలకు అసౌకర్యంగా ఉన్నాయన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కొన్ని వసతి గృహాలు, కస్తూరిబా, ఎంజేపీ పాఠశాలల్లో అదనంగా నిర్మాణాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ హాస్టల్స్ లో పెండింగ్ లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు...

## పుట్లమాంబ ఆలయం లో మహాలక్ష్మి అలంకరణ!



**అంకుశం న్యూస్ ధర్మవరం సెప్టెంబర్ 26:** ధర్మవరం పుట్లమాంబ ఆలయం లో శుక్రవారం మహాలక్ష్మి అలంకరణ అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని ఆలయం కమిటీ ప్రెసిడెంట్ గిర్రాజు,నాగేష్, గిర్రాజు ప్రసాద్ కోటం రవి, పల్లెం కృష్ణ పొట్టా మునేష్, గిర్రాజు భోజి, మహిళలు శ్రీ మతి గిర్రాజు మాధవి లత,గిర్రాజు మహాలక్ష్మి కోటం ఆనంద్,కోటం సుశీల ,కోటం దీపశ్రీ,, కొత్త పాళ్యం షర్మిల,పొట్టా రేష్మి, గిర్రాజు భారతి, తదితరులు ప్రత్యేక కుంకుమార్చన పూజలు చేశారు. ప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. అక్టోబర్ 2 వ తేదీ వరకూ జరుగుతాయి.


## వీలైనంత త్వరలోనే అమెరికాతో ఒప్పందం

భారత్, అమెరికాలకు మేలు చేసేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదర్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నాయని.. ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు పేర్కొంది.
వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అగ్రరాజ్యం సైతం భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింత పెంచుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నా యని అమెరికా వాణిజ్య కార్యదర్శి హెూవార్డ్ లుట్నిక్ తెలిపారు. ఇరుదేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించాయన్నారు. మరోవైపు అక్టోబరులో మలేసియా వేదికగా జరగనున్న ఆసియాన్ శిఖరాగ్ర సమావేశానికి కి ప్రధాని మోదీ, ట్రంప్ హాజరవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సదస్సుకు అనుబంధంగా జరగనున్న మోదీ-ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీలో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన విషయాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. .

## మోదీ-పుతిన్ మధ్య అలాంటి సంభాషణేమీ జరగలేదు

న్యూ ఢిల్లీపై ట్రంప్ విధించిన టారిఫ్‌లు రష్యాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుటె పేర్కొన్న విషయం తెలిసిందే. ట్రంప్ విధించిన టారిఫ్‌లతో ఇబ్బంది పడుతున్న న్యూఢిల్లీ.. రష్యా అధినేతతో ప్రధాని మోదీ మాట్లాడినట్లు తెలిపారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా వ్యూహంపై మోదీ ఆరా తీసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, ఆయన వ్యాఖ్యలపై భారత్ తాజాగా స్పందించింది. నాటో చీఫ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. ప్రధాని మోదీ, పుతిన్ మధ్య అలాంటి చర్చలు ఏమీ జరగలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఫోన్ సంభాషణకు సంబంధించి నాటో చీఫ్ మార్క్ రుటె చేసిన వ్యాఖ్యలు మా దృష్టికి వచ్చాయి. ఆయన చెప్పినట్టుగా మోదీ-పుతిన్ మధ్య అలాంటి చర్చలు ఏవీ జరగలేదు.

## ఐదో రోజు శ్రీ మహాలక్ష్మి అవతారంలో దర్శనమిస్తున్న దుర్గాదేవి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 26:** అనపర్తి పాత ఊరిలోని తురక వీధి సెంటర్లో శ్రీదేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని నాలుగో వార్షికోత్సవమహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భవానీలు అధిక సంఖ్యలో మాలలు ధరించి ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమంనిర్వహించుకుంటూ ఆ ప్రాంతమంతా శరణు ఘోషతో మారుమోగుతోంది. నేడు ఐదో రోజు పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మి దేవిగా అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజ నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గురుస్వామి కొయ్యేన మణికంఠ తేజ బొబ్బిలి ఉమామ శంకర్ కడియాల వెంకటరమణ బండారులోవరాజు తదితరులు పాల్గొని ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

## సినీ నటుడు,ఎమ్మెల్యే బాలకృష్ణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే సత్తి

**– ప్రభుత్వం ధ్రువీకరించిన సర్టిఫైడ్ సైకో బాలకృష్ణ మాత్రమే**
**– కృతజ్ఞతా లేదు... మానసిక స్థితి సరిగా లేదు**




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 26:** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి. ప్రభుత్వం ధ్రువీకరించిన సర్టిఫైడ్ సైకో నందమూరి బాలకృష్ణ మాత్రమేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, బాలకృష్ణ ఇంట్లో బెల్లంకొండ సురేష్ పై కాల్పులు జరిగాయన్నారు. ఆ ఘటనలో మానసిక వ్యాధిగ్రస్తుడిగా సర్టిఫికెట్ తెచ్చుకుని బతుకు జీవుడా అని కేసు నుంచి బయటపడిన సైకో బాలకృష్ణ అని ఎద్దేవా చేశారు. ఆ రోజు డాక్టర్ రాజశేఖరరెడ్డి రాజకీయం చేసి ఉంటే ఈ సైకో జైల్లో ఉండేవారన్నారు. పవిత్రమైన అసెంబ్లీలో అభ్యంతరకర, అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న బాలకృష్ణ తీరు సరికాదన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయం లో తోట పృథ్వీ రాజ్ పూజలు



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 26:** మండపేట ఏడిద రోడ్డు లోని ప్రసిద్ధి చెందిన శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం లో వైసిపి నాయకులు తోట పృథ్వీ రాజ్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వాలిన వీరబాబు, షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా లు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ అమ్మవారికి మహిమ వుందన్నారు. భక్తులకు చక్కని సౌకర్యాలు కల్పిస్తున్న చైర్మన్ వాలిన వీరబాబు ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, వైసిపి నాయకులు తణుకు అశోక్, కోనాల చంద్రబోస్, నమ శివ, చంద్రశేఖర్ భక్తులు పాల్గొన్నారు.

## వడ్డెర్లకు రాయల్టీలో పూర్తి మినహాయింపునివ్వండి.

**– రాష్ట్ర అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.**



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి : సెప్టెంబర్26:** అనంతపురం సత్యసాయి జిల్లాలో చాలామంది వడ్డెర కులస్తులు నిరుపేదలుగా ఉన్నారని వీరికి రాయల్టీలో మినహాయింపు ఇవ్వాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రత్యేకంగా కోరారు. విజయవాడలో జరుగుతున్న శాసనసభ సమావేశంలో శుక్రవారం వడ్డెర్ల సమస్యలపై అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చాలామంది వడ్డేర్లు నిరుపేదలుగా ఉంటూ పగలంతా రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఎన్టి రామారావు ఎంతో మంచి ఉద్దేశ్యంతో వడ్డెర్లకు రాయల్టీని పూర్తిగా మినహాయించారని గుర్తు చేశారు. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఒక్కొక్క ట్రాక్టర్ పై రూ.1000 రూపాయలు రాయల్టీని విధించారని ప్రస్తావించారు. వడ్డెర్లు రోజంతా పనిచేస్తే 1000 రూపాయలు మాత్రమే కూలి వస్తుందని ఈ రాయల్టీ విధించడం వల్ల వారికి వచ్చే కూలీ వారికి ఏమాత్రం మిగలకుండా వారి కుటుంబ పోషణకు చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి వడ్డెర్ల జీవనభృతికి అడ్డంగిగా మారిన రాయల్టీని మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు.


## ఘనంగా ఐలమ్మ130 వ జయంతి



**పోరుమామిళ్ల/బద్వేల్/కడప, సెప్టంబర్ 26( అంకుశం పత్రిక):** బద్వేలు పట్టణంలోని యన్.జి.ఒ హెూం నందు మహనీయుల ఆశయాల సాధన సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల చాకలి ఐలమ్మ 130 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ముఖ్య అధితిగా హాజరైన పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షులు నానబాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... దొరలు, రజాకార్ల అరాచక పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన ఐలమ్మ రజక కులంలో పుట్టడం రజకులందరికీ గర్వకారణం అన్నారు. నిర్వాహకులు మహనీయుల ఆశయాల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ ఐలమ్మను ఆదర్శంగా తీసుకొని రజకులందరూ ఐకమత్యంగా న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.వృత్తికారుల అధ్యక్షులు నాగార్జున, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు పడిగె వెంకటరమణ, రిటైర్డ్ లెక్చరర్ లక్ష్మీనరసయ్య ప్రసంగించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త, పట్టణ అభివృద్ధి సొసైటీ ఉపాధ్యక్షుడు గనుమంతు రాజేష్ కుమార్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం సామాజిక కార్యకర్త గనుమంతు రాజేష్, ఉపాధ్యాయుడు ప్రభల వేటి వెంకటరమణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎ.యస్.ఐ బాలగురన్న, కొరిగం రమణయ్య, వడ్డమాను వెంకటరమణ, నవీన్, కృష్ణయ్య, మనోజ్, రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, సుబ్బయ్య, లక్ష్మయ్య, బద్వేలు కలసపాడు గోపవరం, బి.కోడూరు, పోరుమామిళ్ల, అట్లూరు మండలాల రజక నాయకులు, తదితరులు హాజరు కావడం జరిగింది.

# ఆర్డిటి పై సీఎం స్పందించాలి

- జిల్లా ప్రజా ప్రతినిధులను జిల్లాలోకి అడుగుపెట్టనీయం. ఆర్డిటి పరిరక్షణ సమితి డిమాండ్.






**అనంతపురం ప్రెస్ క్లబ్ అంకుశం న్యూస్ సెప్టెంబర్ 26.** రాయలసీమ వ్యాప్తంగా ఆర్డిటి గత 50 సంవత్సరాలుగా చేపడుతున్న అభివృద్ధి పనులను జిల్లా ప్రజా ప్రతినిధులు గుర్తించకపోవడం గుర్తించకపోవడం సూచనీయమని, కేవలం అసెంబ్లీలో మాట్లాడి మంత్రి నారా లోకేష్ కు విన్నవించడం తప్ప జిల్లా ప్రసిద్ధులు ఏమి చేయకపోవడం బాదేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తో ఆర్డిటి విషయం ముఖ్యమంత్రితో మాట్లాడించి ఆర్డిటి ఎఫ్ ఆర్ సి ఏ రిజిస్ట్రేషన్ చేయించాలని లేనిపక్షంలో ఉమ్మడి జిల్లా అనంతపురం ప్రజా ప్రతినిధులను జిల్లాలోకి అడుగు పెట్టిన ఆర్డిటి పరిరక్షణ సమితి జేవీసీ కన్వీనర్ సాకే హరి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప లు హెచ్చరించారు, ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత మూడు నెలలుగా ఆర్డిటి కోసం జిల్లాలోని కుల సంఘాలు, దళిత సంఘాలు, ఇతర మేధావి వర్గాలు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేస్తున్నప్పటికీ జిల్లా ప్రజా ప్రతినిధులు తూతూ మంత్రంగా స్పందిస్తూ మేము ఉన్నాము అంటూ కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆర్ డి టి దయతో జిల్లాలోని నిరుపేదలు వారి కుటుంబాలకు చెందిన పిల్లలు అలాగే వైద్య సేవలు అందించి అభివృద్ధికి తోడ్పాటు అందించింది ప్రస్తుతం ఆర్డిటి పనిచేయకపోతే పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుంటి సాకులు చూపుతూ ఆర్డిటిని నిర్వీయం చేయాలని చూస్తున్నా అన్నారు ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రజాప్రతితులు ముఖ్యమంత్రి చే అనుకూల ప్రకటన చేయించి ముఖ్యమంత్రి గారు కేంద్ర తో మాట్లాడించి ఆర్డిటి ఎఫ్ సి ఆర్ ఏ ను రిజిస్టర్ చేయించి జిల్లా ప్రజలను ఆదుకోవాలని జేవీసీ సంఘం నాయకులు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు ఈ సమావేశంలో సిపిఎం నాయకులు కేశవరెడ్డి, దళిత సంఘాల నాయకులు కే పి నారాయణస్వామి, సామ్రాట్ మధు ఆకులేడు ఓబులేసు, చిన్న ఆంజనేయులు, ఎంఐఎం నాయకులు భాష, గోవిందు, కుల్లాయి స్వామి, రామకృష్ణ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

# రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలి





- పలువురు మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేసిన సునీత
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని, నిమ్మల రామానాయుడుకు లేఖలు
- సానుకూలంగా స్పందించిన మంత్రులు, నిధుల విడుదలకు సుముఖత

**అంకుశం న్యూస్ అనంతపురం సెప్టెంబర్ 26:** రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి పలువురు మంత్రులను ఎమ్మెల్యే పరిటాల సునీత కలిశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో దేవాదాయశాఖ మంత్రి అనం రామనారాయణ రెడ్డి గారిని కలిసి ఆలయాల పరిధిలో ఉన్న భూమి వినియోగంకి సంబంధించిన వినతి పత్రం అందజేశారు. రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయానికి 66లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో గ్రామ పెద్దలంతా కలిసి మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రాప్తాడు మండల కేంద్రం సమీపంలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న శ్రీ పండమేరు వెంకటరమణ స్వామి దేవాలయానికి ఒక కోటి రూపాయల నిధులు మంజూరు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, గ్రామ పెద్దలు మంత్రి ఆనంని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మతో కలసి రాప్తాడు నియోజకవర్గ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయపాటి సుధాకర్ నాయుడు, ఇతర పెద్దలు మంత్రిని ఘనంగా సన్మానించారు. మరోవైపు పంచాయతీరాజ్ శాఖ మంత్రి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు కేంద్ర మంత్రి పెమ్మసాని, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలవాలని ప్రయత్నించగా.. వారు అందుబాటులో లేకపోవడంతో లేఖలు పంపారు. రాప్తాడు నియోజకవర్గంలో మొత్తం 18 పనులకు 25.55 కోట్ల రూపాయలు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు జనసేన ఎమ్మెల్యే ద్వారా లేఖ అందజేశారు. హరియాన్ చెరువు మీదుగా సి.కే.పల్లి నుండి పోలేపల్లి వరకు, డీఎన్ రోడ్డు నుంచి చందమూర్ వరకు, డిఎన్ రోడ్డు నుండి బసినేపల్లి వరకు, కే.డి.రోడ్డు నుండి బసంపల్లి వరకు, ఎన్.హెచ్-44 నుండి గంతిమర్రి వయా పెనుబోలు మరియు కలికివాండ్లపల్లి వరకు, కనగానపల్లి మండలం శివపురం కొట్టాలకు అప్రోచ్ రోడ్డు, ముత్తవకుంట్ల నుంచి బోయవాండ్ల కొట్టాల వరకు, కనగానపల్లి మండలం ధర్మవరం-కళ్యాణదుర్గం రోడ్డు నుంచి ఎలక్కుంట్ల మీదుగా బద్దలాపురం వెళ్లే రహదారికి, కనగానపల్లి మండలం ఎలక్కుంట్ల నుంచి నెమలివరం రోడ్, అనంతపురం - బళ్లారి రోడ్డు నుంచి ద్వారకా విల్లాల మీదుగా అనంతపురం - కళ్యాణదుర్గం రోడ్డు, కందుకూరు నుండి జంగాలపల్లి మీదుగా %చీ౧%44 వరకు, ఆత్మకూరు నుండి నుసికొట్టాల రోడ్డు, కుర్లపల్లి గ్రామానికి %దీ ౧% రోడ్డు, రంగంపేట ప్రధాన రహదారి నుంచి రంగంపేట గ్రామానికి అప్రోచ్ రోడ్డు, వరిమడుగు నుంచి పాలచెర్ల వరకు బిటి సర్ఫేస్ రోడ్డు, రాప్తాడు నుంచి గంగులకుంట వరకు బిటి రోడ్డు, హంపాపురం నుండి కందుకూరు - చిగిచెర్ల రోడ్డు వరకు బిటి సర్ఫేస్ రోడ్డు, ప్రసన్నాయిపల్లి పంచాయతీ కళాకారుల కాలనీలో సిసి రోడ్డు వంటివి ప్రధానంగా ఉన్నాయి. వీటి అంచనాలకు సంబంధించినవి కూడా లేఖ ద్వారా పూర్తి వివరాలు అందజేశారు. మరోవైపు గత ఆగష్టు నెలలో ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ని కలిసి రాప్తాడు నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి 20కోట్లతో ప్రతిపాదనలు ఇచ్చారు. ఆయన అమరావతికి వచ్చిన నేపథ్యంలో తిరిగి ఇదే అంశంపై కలవాలని ప్రయత్నించారు. కానీ సమయాభావం వలన కలవలేకపోవడంతో లేఖ పంపారు. %ఔణజ ౹ావీఖ% 3.0 పథకం కింద నూతన వాటర్ షెడ్ ప్రాజెక్టుల కొరకు ప్రతిపాదనలు చేశారు. భూగర్భ జలాల పెంపొందించడానికి, వర్షాభావాన్ని తగ్గించడానికి నూతన వాటర్ షెడ్ ప్రాజెక్టులను మంజూరు చేయమని విజ్ఞప్తి చేశారు. ఇందులో అత్మకూరు మండలంలోని సనప, రంగంపేట, వేయపచర్ల, దిగువ తండా, తోపుదుర్తి, మడిగుబ్బ, పంపనూరు, రాప్తాడు మండలం లో గాండ్లపర్తి, కొత్తపల్లి, పాలచెర్ల, భోగినేపల్లి, చెన్నేకొత్తపల్లి మండలంలో న్యామద్దల, రామగిరి మండలంలో పోలేపల్లి ఉన్నాయి. మరోవైపు జలవనరుల శాఖ మంత్రి నిమ్మలరామానాయుడు గారికి ఆత్మకూరు మండలం వేపచెర్లలో గోపాలప్ప కుంట అనే చెరువు ఉండగా.. దీనికి 1.5 ఎం.సి.ఎఫ్.టి. నీటిని నిల్వచేసే సామర్థ్యం ఉంది. ఈ చెరువులో నీటి సరఫరా కల్పిస్తే వేపచెర్ల ఎగువతాండా, దిగువతాండా పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి సాగు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం హంద్రీనీవా ప్రధాన కాలువ నుండి ఈ చెరువుకు కాలువ త్రవ్వకాలు చేపడితే నీటిని నేరుగా చెరువులోకి మళ్లించవచ్చన్నారు. ఇందుకు స్థానికంగా ఉన్న గ్రామస్థులు ఒప్పుకోవడమే కాకుండా ఎలాంటి ఆటంకాలు లేవన్నారు. అందుకే హంద్రీనీవా నీరు అందించే విధంగా అనుమతించాలని కోరారు. ఇలా నియోజకవర్గ అభివృద్ధి మీద పలువురు మంత్రులను కలుస్తూ ఎమ్మెల్యే సునీత బిజీ బిజీగా గడిపారు...

## హరీష్ కుమార్ గుప్తాడిజిపిని కలసిన పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ..



**అంకుశం న్యూస్ అనంతపురం సెప్టెంబర్ 26:** గుంటూరు జిల్లాలోని మంగళగిరిలో శుక్రవారం రాష్ట్ర డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో గౌరవ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిజిపి జిల్లా విషయాల గురించి ఎంపితో అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో డిజిపి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర మరియు జిల్లాల్లో శాంతి భద్రతల పర్యవేక్షణ, నూతన టెక్నాలజీ మరియు సాఫ్ట్వేర్ ని ఉపయోగించి సత్వరం ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారని డిజిపికి ఈ సందర్భంగా అభినందలు తెలియజేశారు. మన రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు మరియు హెూం మంత్రి ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని ఎంపి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అనంత లోఅండర్ గ్రౌండ్ డ్రైనేజీ కి నిధులు కేటాయించండి

- పెరుగుతున్న జనాభాకనుగుణంగా డ్రైనేజీ సమస్య వస్తోంది
- డీపీఆర్ కూడా ఇచ్చాం.. వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే




**అంకుశం న్యూస్ అనంతపురం సెప్టెంబర్ 26:** అనంతపురం జిల్లా అనంతపురం కార్పొరేషన్ పరిధిలో చాలా సంవత్సరాలుగా దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మరోసారి అసెంబ్లీ వేదికగా ప్రజా వాణిని వినిపించారు. శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నగరంలో 50డివిజన్లు, 4పంచాయతీలు ఉన్నాయన్నారు. ఇప్పటికే నగరంలో జనాభా 5లక్షలు దాటిందని.. డ్రైనేజీ సమస్య కూడా పెరుగుతోందన్నారు. అందుకే దీనికి శాశ్వత పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చాలా అవసరం అన్నారు. 2024ఎన్నికల ముందుకు హామీ ఇచ్చిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. గత ఏడాది అక్టోబర్ 17న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు, డిసెంబర్ 30న ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి సమస్యను వివరించి వినతి పత్రం అందజేసినట్టు చెప్పారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీపీఆర్ కూడా ఇచ్చినట్టు వివరించారు. కావున వెంటనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ఆమోదం తెలిపి.. పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారాయణ లను విజ్ఞప్తి చేశారు.

## షిరిడి సాయి బాబాకి వెండి పువ్వుల గొలుసు బహుకరించిన వాడ్రేవు కుటుంబ సభ్యులు




**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ సెప్టెంబర్ 26:** రామచంద్రపురం పట్టణం 23వ వార్డ్ లో పార్క్ వద్ద వేంచేసియున్న శ్రీకోదండ రామాలయంలో షిరిడి సాయిబాబా వారికి రామచంద్రపురం పట్టణ శివాలయం వీధి కాపురస్తులు వాడ్రేవు రామ్మూర్తి, సతీమణి వాడ్రేవు రాజరాజేశ్వరి సంఘం సేవకురాలు వాడ్రేవు సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం వెండి పువ్వుల గొలుసు బాబా వారికి బహుకరించడం జరిగింది. వెండి పూల గొలుసుకు పూజలుచేసిన అనంతరం ఆలయ అర్చక స్వామి మద్దిరాల రాజు కుమార్ స్వామి సమక్షంలో, ఆలయకార్యనిర్వాహక పెద్దలు అంకం శ్రీనివాస్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సాయి ప్రసాద్, వాడ్రేవు వారి సతీమణి రత్న పద్మావతి భక్తులు పాల్గొన్నారు.

## పోలీస్ కానిస్టేబుల్ శిక్షణకు సన్నాహాలు


- పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్



**పోరుమామిళ్ల/కడప, సెప్టెంబర్,26 (అంకుశం పత్రిక):** ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల (ఎస్.సి.టి.పి.సి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డి.టి.సి) శుక్రవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలోని వసతి ఏర్పాట్లను తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం అంతర్గత రహదారులను బాటిల్ అబ్స్టాకల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి డి.టి.సి ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఎస్పీ వెంట అదనపు ఎస్.పి (పరిపాలన) కె.ప్రకాష్ బాబు డి.టి.సి డి.ఎస్.పి అబ్దుల్ కరీం, సిబ్బంది ఉన్నారు.

## గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

-శీలంశెట్టి, జనసేన



**.పోరుమామిళ్ల, సెప్టెంబర్ 26 (అంకుశం పత్రిక):** సంచర్ల పంచాయతీలోని రామేశ్వరం గ్రామం, సంచర్ల గ్రామ కాలనీల్లో వీధిలైట్లు చాలా కాలంగా పనిచేయడం లేదని, ఈ సమస్యను పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కూడా ఎలాంటి స్పందన లేదని, వెంటనే ఏర్పాటు చేయాలని జనసేన మండల అధ్యక్షుడు శీలం శెట్టి లక్ష్మయ్య ఎమ్ పి డిఓ ఉపేంద్రరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు. వీధిలైట్లు లేకపోవడంవల్ల గ్రామ ప్రజలు రాత్రి సమయంలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు రాత్రివేళ బయటకు రావడానికి భయపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా, దొంగతనాలు, పాములు, ఇతర ప్రమాదాలు సంభవించే అవకాశమూ ఉందని అన్నారు. తిమ్మారెడ్డి పల్లె (పంచాయతీ) తోకల పల్లె గ్రామంలో గత నెల రోజులుగా ఇంటింటి చెత్తను కూడా సేకరించడం లేదని అన్నారు. పంచాయతీ ఈఓ దృష్టికి తీసుకుపోయినా ఏ మాత్రం సందన లేదు అన్నారు. ఇంకా ఇతర పంచాయతీలలో కూడా ఇలాంటి సమస్య అనేకములు ఉన్నాయని గ్రామ ప్రజల తరపున ఎమ్పిడిఓకు వినతిపత్రం సమర్పించారు. ఈపంచాయతీలలో వీధిలైట్లు తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని శీలం శెట్టి కోరారు.

## జిల్లాలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నాం

- జిల్లా కలెక్టర్ ఏ. శాంప్రసాద్

అంకుశం ప్రతినిధి పుట్టపర్తి- సెప్టెంబరు 26 : శ్రీ



సత్యసాయి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోజిల్లాలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏ. శాంప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కు వివరించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో స్వచ్ఛతాహి సేవ, సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై నెల రోజుల సెలబ్రేషన్స్ కార్యక్రమం, సీజనల్ కండిషన్స్, పిఎం కుసుమ్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టుల భూ సేకరణ సంబంధిత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. స్థానిక కలెక్టరేట్లోని తన చాంబర్ నుండి జిల్లా కలెక్టర్ ఈ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొని మాట్లాడుతూ.. సత్యసాయి జిల్లాలో స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నామని అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ తో పాటు ఇంచార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ ఈ సంపత్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ జి ఎస్ టి కృష్ణవేణి, డిపివో సమత, జీఎస్ డబ్ల్యు ఎస్ నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, ల్యాండ్ సెక్షన్ సూపరిండెంట్ బాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. డివిజనల్ పిఆర్ఓ పుట్టపర్తి

# పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలి

- పరిశ్రమలు ఏర్పాటుకు అనుమతులు వెంటనే మంజూరు చేయాలి
- జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్





**అంకుశం న్యూస్అనంత పురం, సెప్టెంబర్ 26:** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా సంబంధిత శాఖల అధికారులు ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ఆదేశించారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి వాతావరణం కలగజేయాలని తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్,లో 62వ జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ మరియు ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పరిచే విధంగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను అందజేసి పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయుచున్న తిమ్మసముద్రం, ఉరిచింతాల, కుదేరుప్రాంతాలలో ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వాడాలను త్వరితగతిన అభివృద్ధి చేయాలని ఏ పిఐఐసి జోనల్ మేనేజర్ ను ఆదేశించారు. పిఎంఈజిపి పథకం ద్వారా అర్హులైన వారి నుండి నాణ్యతగల పథకాలను ఎంపికచేయాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు. జిల్లాలో 2015- 2020-23,2023 -27 పాలసీలో 17 యూనిట్లకు గాను పెట్టుబడి రాయితీ, విద్యుత్ రాయితీ, వడ్డీ రాయితీ, స్టాంప్ డ్యూటి రాయితీ లకు 93 లక్షల 83 వేల 782 రూపాయల సబ్సిడి మంజూరుకు ఆమోదం తెలిపారు. సింగిల్ విండో పోర్టల్ లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న అనుమతులను నిర్ణీత సమయంలో ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, రవాణా శాఖ అధికారి వీర్రాజు, డి జడ్ ఎం దేవ కాంతమ్మ, ఎల్డీఎం నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.